శంషాబాద్ విమానాశ్రయంలో జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్

దక్షిణాసియాలో తొలిసారిగా ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్, శంషాబాద్, న్యూస్‌టుడే: విమానాశ్రయాలు.. విమానయాన సంస్థల్లో మానవ వనరులకు పెరుగుతున్న అవకాశాలను పరిగణనలోకి తీసుకున్న జీఎంఆర్ సంస్థ, విమానాల నిర్వహణ ఇంజినీరింగ్ (ఏఎంఈ) కోర్సును ప్రవేశపెట్టింది. ఇందుకోసం శంషాబాద్ విమానాశ్రయ ప్రాంగణంలో ఏవియేషన్ స్కూల్‌ను ఏర్పాటు చేసింది. నాలుగేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సును జూన్‌లో ప్రారంభించనుంది. ఇంటర్‌లో గణితం, భౌతిక-రసాయన శాస్త్రాలు చదివి 50% మార్కులతో పాసైన విద్యార్థులు ఈ కోర్సు చదివేందుకు అర్హులు. వీరికి అర్హత పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణుల్లో 200 మందికి ప్రవేశాలు ఇవ్వనున్నారు. టీఎస్-ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణులకూ అవకాశం కల్పించనున్నారు. ఈ కోర్సు ఉత్తీర్ణులకు దేశ, విదేశాల్లోని పౌర విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు లభించనున్నాయి. దక్షిణాసియాలో ఇది తొలి ఏవియేషన్ స్కూల్ అని జీఎంఆర్ ఏరో టెక్నిక్ అకౌంటబుల్ మేనేజర్, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్ మంగళవారం ఇక్కడ తెలిపారు.

రెండేళ్లు తరగతులు.. రెండేళ్లు శిక్షణ

ఏఎంఈ కోర్సులో విద్యార్థులకు రెండేళ్లు తరగతులు నిర్వహించనున్నారు. మరో రెండేళ్లు ప్రయోగాత్మక శిక్షణ ఉంటుంది. తరగతులు-పరీక్షలు కూడా అంతా ఆన్‌లైన్‌లోనే. మూడో సంవత్సరం నుంచి విమానాల నిర్వహణపై ప్రయోగాత్మక శిక్షణ ఇస్తారు. విమానాల ఇంజిన్లు, కాక్‌పిట్‌లో భద్రతా వ్యవస్థ, టైర్లు, రెక్కలు పనిచేసే విధానం, విమానం గాల్లో ఉన్నప్పుడు అనూహ్యంగా తలుపులు తెరుచుకుంటే లిప్తపాటులోనే చేపట్టాల్సిన చర్యలు, హ్యాంగర్‌లోకి విమానం రాగానే ఇంజిను సహా విడిభాగాల పరిస్థితి అంచనా.. వంటి కీలక అంశాలపై శిక్షణ ఉంటుంది.

నాలుగో సంవత్సరంలో విమాన విడిభాగాలను వేర్వేరు ప్రాంతాల్లో ఉంచి విమానాన్ని రూపొందించాలంటూ టాస్క్‌లు అప్పగిస్తారు. ఇందుకోసం విమానాన్ని పోలిన సిమ్యులేటర్ విమానాన్ని హ్యాంగర్‌లో ఉంచారు. శిక్షణ కాలంలో బోయింగ్-737, ఎయిర్‌బస్320, 320ఏ విమానాల మరమ్మతులపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తారు.

పౌర విమానయాన.. ఐరోపా భద్రత సంస్థ అనుమతులు: ఈ కోర్సుకు పౌరవిమానయాన సంస్థ సంచాలకులు, ఐరోపా విమానయాన భద్రతా ఏజెన్సీ (యాసా) నుంచి అనుమతులు తీసుకున్నామని అశోక్ గోపీనాథ్ తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థులు డీజీసీఏ మూల్యాంకనం మేరకు మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సును (బీ1), యాసా మూల్యాంకనం ప్రకారం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సును (బీ2) చదవవచ్చని, మరింత ఆసక్తి ఉన్న విద్యార్థులు రెండు కోర్సులూ చదువుకునే వీలుంటుందని తెలిపారు. నాలుగేళ్ల కోర్సు తర్వాత పట్టా ఇవ్వడంతోపాటు విమాన భద్రత ధ్రువీకరణ అధికారిగా లైసెన్సు ఇస్తామన్నారు. కోర్సు ఫీజు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు.

సిమ్యులేటర్ల గురించి వివరిస్తున్న స్కూల్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ గోపీనాథ్

ఈ ఏడాది ఐపీఓల ద్వారా రూ.4.15 లక్షల కోట్ల సమీకరణ!

కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అంచనా

ముంబయి: కొత్తతరం సాంకేతికత కంపెనీలు నిధుల సమీకరణ బాట పడుతుండటంతో, ప్రస్తుత ఏడాది (2024)లో పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగే అవకాశం ఉందని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ పేర్కొంది. తొలి పబ్లిక్ ఆఫర్‌ల (ఐపీఓ) ద్వారా 5000 కోట్ల డాలర్ల (సుమారు రూ.4.15 లక్షల కోట్ల) మేర కంపెనీలు సమీకరించే అవకాశం ఉందని అంచనా వేసింది. నిధుల సమీకరణ విలువపరంగా 2021లో ఏర్పడిన రికార్డును కూడా ఇది అధిగమిస్తుందని తెలిపింది. 2023లో దేశీయ ఫండ్ సంస్థలు 25.8 బిలియన్ డాలర్లను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాయని.. ఈ ఏడాది ఆ మొత్తం 50 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎస్.రమేశ్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనైనా, ఆ ప్రభావం పబ్లిక్ ఇష్యూల కార్యకలాపాలపై దీర్ఘకాలం పాటు కనిపించకపోవచ్చని పేర్కొన్నారు. 2023లో ప్రధాన ప్లాట్‌ఫామ్‌పై 59 కంపెనీలు ఐపీఓకు రాగా.. రూ.53,000 కోట్లు సమీకరించాయి. పబ్లిక్ ఇష్యూ నిధుల సమీకరణ విలువ పరంగా ప్రపంచంలో అమెరికా, చైనా, జపాన్ తర్వాత నాలుగో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా భారత్ నిలిచింది.

అదానీ కంటే ఎక్కువ చెల్లించే సంస్థకే ల్యాంకో అమర్‌కంటక్ ప్రాజెక్టు

ఎన్‌సీఎల్‌టీ పరిశీలనలో ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: రుణభారంతో కుంగిపోయి, దివాలా ప్రక్రియను ఎదుర్కొంటున్న ల్యాంకో అమర్ కంటక్ ధర్మల్ ప్రాజెక్టు భవితవ్యం త్వరలో తేలిపోనుందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును దక్కించుకునేందుకు అదానీ పవర్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, పీఎఫ్‌సీ (పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్) కన్సార్షియం పోటీ పడుతున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, పీఎఫ్‌సీ కన్సార్షియానికి కాకుండా ఈ ప్రాజెక్టును తాను సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో అదానీ పవర్, దీనికి అధిక మొత్తం చెల్లించేందుకు సిద్ధపడుతోంది. ఇందులో భాగంగా ఇతర పోటీదార్ల కంటే అధికంగా రూ.4,100 కోట్ల బిడ్‌ను అదానీ పవర్ దాఖలు చేసింది. దీన్ని ప్రామాణికంగా తీసుకుని, వేలం నిర్వహించాలని ఈ వ్యవహారంలో రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ)గా వ్యవహరిస్తున్న సౌరభ్ కుమార్, ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్)కి నివేదించినట్లు తెలిసింది. దీనిపై ఎన్‌సీఎల్‌టీ త్వరలో విచారణ చేపట్టే అవకాశం ఉందని సమాచారం. అదానీ పవర్ బిడ్‌ను ప్రామాణికంగా తీసుకుని, వేలం నిర్వహించే షష్ఠంలో ఇంతకంటే ఎక్కువ మొత్తం చెల్లించడానికి పోటీలో ఉన్న సంస్థలు సిద్ధపడాల్సి వస్తుంది. లేనిపక్షంలో అదానీ పవర్‌కు ల్యాంకో అమర్‌కంటక్‌ను సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదార్ల సమావేశంలో రామ్‌రాజ్ కాటన్ వచ్చే అయిదేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తమిళనాడు ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకులు కె.ఆర్.నాగరాజన్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రెనో నుంచి 5 కొత్త వేరియంట్లు

- **ధరల శ్రేణి రూ.4.69–10.99 లక్షలు**
- **మూడేళ్లలో విపణిలోకి 5 కొత్త కార్లు**

దిల్లీ: ఫ్రెంచ్ వాహన తయారీ సంస్థ రెనో.. తన క్విడ్, ట్రైబర్, కైగర్ మోడళ్లలో 5 కొత్త వేరియంట్లను మంగళవారం దేశీయ విపణిలోకి విడుదల చేసింది. వీటి ధరల శ్రేణి రూ.4.69-10.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). మరింతమంది వినియోగదార్లను ఆకట్టుకునేందుకు ఈ వేరియంట్లను తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. దేశంలో వాహనాలకు గిరాకీ పెరుగుతున్నందున, వచ్చే మూడేళ్లలో మరో 5 కొత్త కార్లను దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెడతామని రెనో ఇండియా ఆపరేషన్స్ కంట్రీ సీఈఓ, ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లి వెల్లడించారు. ఇందులో సరికొత్త మోడళ్లతో పాటు క్విడ్, ట్రైబర్‌లలో తదుపరి తరం వాహనాలు ఉంటాయని వివరించారు.

ఈ ఏడాది రెండంకెల వృద్ధి ఆశిస్తున్నాం: గత ఏడాది సంస్థ అనేక సవాళ్లను ఎదుర్కోవడంతో విక్రయాలు తగ్గాయి. ఈ ఏడాది వ్యాపారం పుంజుకోవచ్చనే అభిప్రాయాన్ని వెంకట్రామ్ వ్యక్తం చేశారు. గత ఏడాది సంస్థ దేశీయ విపణిలో 49,000 వాహనాలను విక్రయించింది. 28,000 కార్లను అంతర్జాతీయ విపణికి ఎగుమతులు చేసింది. ఈ ఏడాది రెండంకెల వృద్ధిపై దృష్టి సారించామని, అందుకే ప్రస్తుత ఉత్పత్తుల శ్రేణిలో కొత్త వేరియంట్లు తీసుకొచ్చామని వెంకట్రామ్ వెల్లడించారు.

అంకుర సంస్థలో 51% కొనుగోలు చేయనున్న నిహార్ ఇన్ఫో గ్లోబల్

ఈనాడు, హైదరాబాద్: నిహార్ ఇన్ఫో గ్లోబల్ అనే హైదరాబాద్ కంపెనీ, ఆరోగ్య సేవల రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న అంకుర సంస్థ, లైఫ్ 108 హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 51% వాటా కొనుగోలు చేయనుంది. ఈ సంస్థ పలు రకాల వైద్య ఉత్పత్తులను ఇ-కామర్స్ సంస్థల ద్వారా విక్రయిస్తోంది. మందుల హోల్‌సేల్, రిటైల్ విక్రయాలు సైతం చేపట్టే యత్నాల్లో ఈ సంస్థ ఉంది. దీన్లో 51% వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యాక నిహార్ ఇన్ఫో గ్లోబల్‌కు అనుబంధ సంస్థగా మారుతుంది.

3 రోజులకో కొత్త విక్రయ కేంద్రం

2028 కల్లా 1000కి పెంచుకుంటాం: టాటా స్టార్‌బక్స్

ముంబయి: దేశంలో తమ విక్రయ కేంద్రాల సంఖ్యను ప్రస్తుత 390 నుంచి 2028 కల్లా 1000కి పెంచుకుంటామని టాటా స్టార్‌బక్స్ మంగళవారం ప్రకటించింది. ఇందుకోసం సగటున ప్రతి 3 రోజులకు ఒక కొత్త విక్రయ కేంద్రాన్ని తెరవాలని భావిస్తున్నామని, రెండు-మూడో అంచె నగరాల్లోనూ అడుగుపెట్టాలని అనుకుంటున్నామని తెలిపింది. టాటా స్టార్‌బక్స్.. టాటా గ్రూపు, స్టార్‌బక్స్‌ల సంయుక్త సంస్థ. అంతర్జాతీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విపణుల్లో భారత్ ఒకటి అని.. ఇక్కడ తమ ఉనికిని బాగా పెంచుకుంటున్నామని వివరించింది. ప్రస్తుత సిబ్బంది సంఖ్యను రెట్టింపు చేసి 8,600కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొంది. డ్రైవ్-త్రూస్, విమానాశ్రయాలు, 24-గంటల స్టోర్స్ మోడళ్లలో విక్రయకేంద్రాలు నెలకొల్పనుంది. స్టార్‌బక్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మణ నరసింహన్ భారత్ పర్యటనకు విచ్చేసిన అనంతరం, టాటా స్టార్‌బక్స్ నుంచి ఈ ప్రకటన రావడం విశేషం.

2036 నాటికి మరో 6.4 కోట్ల ఇళ్లు కావాలి

క్రెడాయ్-లియాసెస్ ఫోరాస్ అంచనా

దిల్లీ: పెరుగుతున్న జనాభా అవసరాల కోసం 2036 నాటికి అదనంగా 6.4 కోట్ల కొత్త ఇళ్ల అవసరం ఉంటుందని క్రెడాయ్-లియాసెస్ ఫోరాస్ నివేదిక అంచనా వేసింది. మంగళవారం వారణాసిలో నిర్వహించిన న్యూ ఇండియా సదస్సులో ఈ నివేదికను రెండు సంస్థలు విడుదల చేశాయి. 2018 నాటికి 2.9 కోట్ల ఇళ్లకు కొరత ఉందని ఈ నివేదిక పేర్కొంది. 2036 నాటికి మొత్తం 9.3 కోట్ల గృహాలకు గిరాకీ ఉంటుందని అంచనా వేసింది. స్థిరాస్తి రంగంలో తదుపరి వృద్ధి ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాల నుంచే ఉంటుందని పేర్కొంది. గత ఏడాది ఇళ్లకు అధిక గిరాకీ ఏర్పడిందని తెలిపింది. దేశవ్యాప్తంగా 19,050కి పైగా ప్రాజెక్టులు రెరా దగ్గర నమోదయ్యాయని, ఇందులో 45 శాతానికి పైగా నివాస ప్రాజెక్టులున్నాయని వెల్లడించింది. ఈ సందర్భంగా క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ మాట్లాడుతూ దేశంలో వేగంగా పెరుగుతున్న జనాభా వల్ల ఇళ్లకు గిరాకీ, సరఫరా వృద్ధి చెందుతోందన్నారు. అదే సమయంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పెద్ద గృహాల కోసం చూస్తున్నారని తెలిపారు.

ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. క్రెడాయ్ ఛైర్మన్ మనోజ్ గౌర్ మాట్లాడుతూ.. గత ఏడాది స్థిరాస్తి రంగం గుర్తుంచుకోదగ్గ సంవత్సరంగా నిలిచిందని వివరిస్తూ, 2024లోనూ ఇదే తరహా వృద్ధి, గిరాకీ లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరే క్రమంలో స్థిరాస్తి రంగం పాత్ర ఎంతో కీలకమని లియాసెస్ ఫోరాస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ కపూర్ అన్నారు.

కోడి గుడ్లు

9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	560
వరంగల్	562
10వ తేదీకి	
విజయవాడ	565
గోదావరి	565
విశాఖపట్నం	625
చిత్తూరు	583

16% తగ్గిన నియామకాలు: నౌక్రీ జాబ్‌స్పీక్

ముంబయి: ఉద్యోగ నియామకాల విషయంలో ఐటీ, బీపీఓ, విద్య, రిటైల్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లోని సంస్థలు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నాయి. దీంతో ఆయా రంగాల్లో గత డిసెంబరులో ఉద్యోగ నియామకాలు 2022 డిసెంబరుతో పోలిస్తే దాదాపు 16% తగ్గినట్లు నౌక్రీ జాబ్‌స్పీక్ నివేదిక మంగళవారం వెల్లడించింది. కానీ 2023 నవంబరుతో పోలిస్తే 2% వృద్ధి కనిపించింది. ప్రధానంగా ఐటీయేతర రంగాల్లో నియామకాలు పెరగడం ఇందుకు కారణం. ఐటీ రంగంలో నియామకాలు మందగించడంతో, గత నెలలో క్షీణత నమోదైందని నౌక్రీ.కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ వెల్లడించారు. 2022 డిసెంబరుతో చూస్తే.. గత నెలలో బీపీఓలో 17%, విద్యారంగంలో 11%, రిటైల్‌లో 11%, ఆరోగ్య సంరక్షణలో 10% వరకు నియామకాలు తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఐటీ రంగంలో 2023 ద్వితీయార్ధం నుంచే నియామకాలు తగ్గినట్లు పేర్కొంది. 2022 డిసెంబరుతో పోలిస్తే, గత నెలలో 21% మేరకు ఈ రంగంలో ఉద్యోగాలు తగ్గాయి.

ఈ నైపుణ్యాలకు గిరాకీ భేష్: ఫుల్ స్టాక్ డేటా సైంటిస్ట్, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీర్, ఆటోమేషన్ ఇంజినీర్ వంటి నిపుణులకు మాత్రం గిరాకీ బాగుంది. ఔషధ రంగంలోనూ నియామకాలు కాస్త పెరిగాయి. చెన్నైలో 24%, బెంగళూరు, హైదరాబాద్‌లలో 23% చొప్పున, పుణెలో 17%, కోల్‌కతాలో 16% మేరకు ఉద్యోగ నియామకాల్లో క్షీణత నమోదయ్యింది.

2023 ఈవీ అమ్మకాల్లో 49% వృద్ధి: ఫాడా

ముంబయి: గత ఏడాది దేశంలో విద్యుత్ వాహన (ఈవీ) విక్రయాలు 15,29,947గా నమోదయ్యాయి. 2022లో ఈవీ పరిశ్రమ మొత్తం విక్రయాలు 10,25,063తో పోలిస్తే.. గతేడాది 49% వృద్ధి సాధించినట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. విద్యుత్ద్విచక్రవాహన విక్రయాలు 6,31,464 నుంచి 36.09% పెరిగి 8,59,376కు చేరాయి. విద్యుత్ త్రిచక్ర వాహన విక్రయాలు 3,52,710 నుంచి 65.23% అధికమై 5,82,793గా నమోదయ్యాయి. విద్యుత్ వాణిజ్య వాహన విక్రయాలు 114.16% వృద్ధితో 5,673కు పెరిగాయి. విద్యుత్ ప్రయాణికుల వాహన విక్రయాలు 2022లో 38,240 నుంచి 114.71% పెరిగి 82,105కు చేరినట్లు ఫాడా గణాంకాలు తెలిపాయి.

దేశీయ తయారీకే ప్రాధాన్యం

అంతర్జాతీయ దిగ్గజ సీఈఓలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ

గాంధీనగర్: వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా, దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు, ఉద్యోగాల సృష్టి నిమిత్తం అంతర్జాతీయ దిగ్గజ సీఈఓలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సుకు ముందు సుజుకీ మోటార్ కార్ప్, మైక్రాన్ టెక్నాలజీ, ఏపీ మొల్లర్‌కు చెందిన ఉన్నతాధికారులతో మోదీ సమావేశమై పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, పెట్టుబడి అవకాశాలపై చర్చించారని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది.

✦ దేశీయంగా తయారు చేసిన వాహనాలను ఎగుమతి చేయడం ద్వారా, అంతర్జాతీయంగా భారత్‌ను ఓ కీలక దేశంగా మార్చేందుకు మారుతీ సుజుకీ ప్రణాళికలపై ప్రధాని మోదీ, సుజుకీ మోటార్ కార్ప్ ప్రతినిధ్య డైరెక్టర్, ప్రెసిడెంట్ టొషిహిరో సుజుకీ చర్చించారు. వాహన తుక్కు, వాహన రీసైక్లింగ్‌లో అంతర్జాతీయ అత్యుత్తమ ప్రమాణాలను అమలు చేయడంపైనా మాట్లాడారని పీఎంఓ తెలిపింది.

✦ 'భారత్‌లో సెమీ కండక్టర్ల తయారీకి చేపడుతున్న చర్యల గురించి, అమెరికాకు చెందిన మైక్రాన్ టెక్నాలజీ సీఈఓ, ప్రెసిడెంట్ సంజయ్ మెహ్రోత్రాతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చించారని పీఎంఓ వెల్లడించింది. మైక్రాన్ గుజరాత్‌లో 2.75 బిలియన్ డాలర్లతో సెమీ కండక్టర్ ప్లాంటు నిర్మాణాన్ని చేపట్టింది. ఈ ఏడాది డిసెంబరు కల్లా ఈ ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది.

✦ దుబాయ్‌కు చెందిన లాజిస్టిక్స్ కంపెనీ డీపీ వరల్డ్ సీఈఓ, ఛైర్మన్ అహ్మద్ బిన్ సులాయెమ్‌తో కూడా ప్రధాని సమావేశమయ్యారు. డీపీ వరల్డ్ మనదేశంలో 5 కంటెయినర్ టర్మినళ్లను నిర్వహిస్తోంది.

✦ ఏపీ మొల్లర్ సీఈఓ కీత్ స్వెండ్‌సెన్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు. హరిత హైడ్రోజన్, సరకు రవాణా మౌలిక వసతుల అభివృద్ధి లాంటి అంశాలపై చర్చించారు.

✦ డీకిన్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఇయిన్ మార్టిన్‌తో సమావేశమైన ప్రధాని మోదీ.. సైబర్ భద్రతపై ప్రభుత్వం, విద్యా సంస్థల మధ్య సమన్వయం మరింతగా పెంచే అంశంపై చర్చించారు.

✦ జనవరి 10-12 తేదీల్లో జరగనున్న వైబ్రెంట్ గుజరాత్ గ్లోబల్ సదస్సుకు 133 దేశాల నుంచి సీఈఓలు, వ్యాపారవేత్తలు, మంత్రులు, దౌత్యవేత్తలు సహా సుమారు 1,00,000 మంది సందర్శకులు రావొచ్చని అంచనా వేస్తున్నారు.

అదానీ గ్రూప్‌నకు ఊరట

డిసెంబరు 19 నాటి ఆదేశాలను నిలిపేసిన హైకోర్టు

దిల్లీ: అదానీ గ్రూప్ దిగుమతుల బిల్లులను ఉద్దేశపూర్వకంగా ఎక్కువ చేసి (ఓవర్ ఇన్‌వాయిసింగ్) చూపించిందన్న ఆరోపణలను 'నిశితంగా, వేగంగా' పరిశీలించాలని సీబీఐ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్(డీఆర్‌ఐ)లను కోరుతూ జారీ చేసిన తన ఆదేశాలను దిల్లీ హైకోర్టు నిలిపివేసింది. అదానీ పవర్ మహారాష్ట్ర లిమిటెడ్‌పై కమిషనర్ ఆఫ్ కస్టమ్స్(ఇంపోర్ట్) దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉందని.. ఆ కేసు తేలే వరకు 2023 డిసెంబరు 19న తాము జారీ చేసిన ఆదేశాలను పక్కన పెడుతున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ కుమార్ కైత్, నీనా బన్సాల్ కృష్ణతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఓవర్ ఇన్‌వాయిసింగ్ ఎందుకంటే: కంపెనీలు దిగుమతి చేసుకునే వస్తువులు లేదా సేవల విలువను ఎక్కువ చేసి చూపడం ద్వారా ఎక్కువ ఖర్చు చేసినట్లు చూపొచ్చు. పలు ఇతర అవసరాలకు ఆ నిధులు వెచ్చించుకోవచ్చు. పన్నులు లేదా కస్టమ్స్ సుంకాన్ని ఎగవేయడానికి ఇలా చేయొచ్చు. అదానీ పవర్ మహారాష్ట్రపై కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ దాఖలు చేసిన అప్పీలును 2023 మార్చి 27న సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే దానిపై రివ్యూ పిటిషన్‌ను కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ వేసింది. ఇపుడు దానిపై తీర్పు వెలువడాల్సి ఉంది.

ఈ ఏడాదీ మందగమనమే

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ బ్యాంకు అంచనా

వాషింగ్టన్: అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం, తగ్గుతున్న వాణిజ్యం, క్షీణిస్తున్న చైనా ఆర్థిక వ్యవస్థ తదితరాల కారణంగా వరుసగా మూడో ఏడాదీ (2024) ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం పాలు కావొచ్చని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. 2024లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 2.4% మాత్రమే వృద్ధి చెందొచ్చని అంచనా వేసింది. 2023లో 2.6%, 2022లో 3% కంటే ఇది తక్కువే. కరోనా ఏడాది (2020) ప్రాతిపదిక తక్కువగా ఉండడంతో 2021లో ఆర్థిక వ్యవస్థ 6.2% రాణించింది. హమాస్‌తో ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్‌లో సంఘర్షణ వంటివి అంతర్జాతీయ అనిశ్చితులకు ఆజ్యం పోశాయని.. వృద్ధిని బలహీనపరుస్తున్నాయని వివరించింది. అప్పుల్లో కూరుకుపోయి ఉన్న పేద దేశాలు పేదరికం నుంచి బయటకు రావడానికి కానీ, పర్యావరణ మార్పులపై పోరాటం చేయడానికి కానీ.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని ప్రపంచబ్యాంక్ పేర్కొంది. 'స్వల్పకాలంలో వృద్ధి బలహీనంగానే కొనసాగొచ్చు. అభివృద్ధి చెందిన పలు దేశాలు ఒక సాలెగూడులో చిక్కుకున్నాయి. ప్రతి ముగ్గురిలో ఒకరికి ఆహారం కూడా అందడం లేదని ప్రపంచ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త ఇండర్మిట్ గిల్ పేర్కొన్నారు. ఇతర అంచనాలు..

✦ గతేడాదిలో 2.5 శాతం వృద్ధిని నమోదు చేయనున్న అమెరికా, ఈ ఏడాది 1.6 శాతానికే పరిమితం కావొచ్చు.

✦ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో అంతర్జాతీయ ద్రవ్యోల్బణం 5.3 శాతం నుంచి 3.7 శాతానికి పరిమితం కావొచ్చు. అధిక వడ్డీ రేట్లు ఇందుకు దోహదం చేస్తున్నాయి. 2025లో ద్రవ్యోల్బణం 3.4 శాతానికే చేరొచ్చు. కరోనాకు ముందుతో పోలిస్తే మాత్రం ఇది ఎక్కువే.

✦ అమెరికా తర్వాత అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా ఈ ఏడాది 4.5 శాతం, వచ్చే ఏడాది 4.3 శాతం మేర వృద్ధి చెందొచ్చు. గతేడాది నమోదైన 5.2 శాతం వృద్ధితో పోలిస్తే ఇవి తక్కువ.

ఈ ఏడాది ఆఖరుకు నిఫ్టీ లక్ష్యం 23,500

అంచనా పెంచిన గోల్డ్‌మాన్ శాక్స్

దిల్లీ: ఈ ఏడాది చివరకు నిఫ్టీ సూచీ 23,500 పాయింట్లకు చేరొచ్చని అమెరికాకు చెందిన బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మాన్ శాక్స్ తాజా అంచనాల్లో తెలిపింది. ప్రస్తుత స్థాయిలతో పోలిస్తే ఇది 9 శాతం ఎక్కువ. ఇంతకుముందు నిఫ్టీ లక్ష్యాన్ని 21,800 పాయింట్లుగా గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా వేసింది. ఒక్కో షేరుపై ఆదాయ అర్జన అంచనాల్లో పెంపు, విలువల్లో పునఃరేటింగ్ ఆధారంగా ఈ సవరణ చేసినట్లు పేర్కొంది. రెండు నెలల క్రితంతో పోలిస్తే అంతర్జాతీయ సూక్ష్మ ఆర్థిక పరిస్థితులు మరింత సానుకూలంగా మారాయని బ్రోకరేజీ సంస్థ అభిప్రాయపడింది. అమెరికా వృద్ధి బలంగా నమోదు కావచ్చన్న అంచనాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక రేట్లను తగ్గించొచ్చన్న ఆశాభావం ఇందుకు దోహదం చేసిందని తెలిపింది. దేశీయ రంగాలు, లార్జ్ క్యాప్ షేర్లపై తమ ప్రాధాన్యాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించింది.

ఆరంభ లాభాలు ఆవిరి

సెన్సెక్స్ ▲ 31 — 71386
నిఫ్టీ ▲ 32 — 21545

ఆఖర్లో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీల ఆరంభ భారీ లాభాలు ఆవిరయ్యాయి. కంపెనీల డిసెంబరు త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభానికి ముందు, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా పెరిగి 83.13 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.72% లాభపడి 77.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై లాభపడగా, సియోల్, హాంకాంగ్ నష్టపోయాయి. ఐరోపా సూచీలు నష్టాల్లో ట్రేడయ్యాయి.

సమీక్ష

సెన్సెక్స్ ఉదయం 71,770.91 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ 680.25 పాయింట్ల లాభంతో 72,035.47 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆఖరి గంటన్నరలో భారీ లాభాలను కోల్పోయిన సూచీ, కేవలం 30.99 పాయింట్లు అధికంగా 71,386.21 వద్ద ముగిసింది. నిఫ్టీ 31.85 పాయింట్ల లాభపడి 21,544.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 21,517.85-21,724.45 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ రూ.4000 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రకటించడంతో **బజాజ్ ఆటో** షేరు ఇంట్రాడేలో రూ.7,420 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1.55% లాభంతో రూ.7,093.75 వద్ద ముగిసింది.